క్లుప్తంగా

క్రమ శిక్షణతోనే సత్ఫలితాలు



టాపర్లుగా నిలిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ భారతీ దేవి

మిరుదొడ్డి(దుబ్బాక): క్రమ శిక్షణతోనే విద్యార్థులు సత్ఫలితాలు సాధిస్తారని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ భారతీ దేవి అన్నారు. ఇంటర్ ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను సోమవారం మోడల్ స్కూల్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా చదివిన విద్యార్థులు తమ జీవితాలకు మంచిబాటలు వేసుకుంటారన్నారు. అధ్యాపకులు దేవ దాసు, శ్రీనివాస్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రచయితలపై దాడి సరికాదు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన సమూహ రచయితల సంఘం సదస్సులో పాల్గొన్న కొందరు రచయతలపై చేసిన దాడి సరికాదని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు, మంజీరా రచయితలు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. సమాజంలో లౌకిక విలువలు పెంపొందించాలనే లక్ష్యంతో వివిధ రచయితల సంఘాల వేదిక నిర్వహించిన సదస్సులోకి ఇతరులు చొరబడి రచయితలు పసునూరి రవీందర్, నరేశ్, సూఫీ, భూపతి వెంకటేశ్వర్లు, మెర్సీ మార్గరేట్‌తోపాటు మరికొందరు రచయితలపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. ఈ దాడికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతి వాహనాన్ని చెక్ చేయాలి



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఏసీపీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): జిల్లా సరిహద్దులో ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా చెక్ చేయాలని ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆదేశించారు. సోమవారం జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు పాటిస్తూ డబ్బు, మద్యంపై డేగకన్ను వేయాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండడం వల్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, 24 గంటలు చెక్‌పోస్టు వద్ద సిబ్బంది ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్నకు ముడుపు కట్టిన అభ్యర్థి



స్వామి వారి సన్నిధిలో చామల కిరణ్‌కుమార్

కొమురవెల్లి(సిద్దిపేట): భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ప్రాంగణంలోని గంగిరేణి చెట్టుకు ముడుపుకట్టారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ స్వామిని దర్శించుకోవడం చాలా సంతృప్తినిచ్చిందన్నారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకుడు రాకేశ్‌రెడ్డి, ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, సనాది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట, దుబ్బాక ఆర్టీసీ డిపో పరిధిలో నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 12 నుంచి 1గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలపై 99592 26271 నంబరుకు సంప్రదించాలని ఆయన కోరారు.

ఉపాధి కూలీలకు నీడ కల్పించాలి

వర్గల్(గజ్వేల్): పని ప్రదేశంలో ఉపాధిహామీ కూలీలకు నీడను కల్పించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన వర్గల్ మండలం పర్యటించారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ఉపాధిహామీ పథకం పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు సరిపడా నీడలేకపోతే వడదెబ్బకు గురవుతారని పేర్కొన్నారు. తాగు నీరు, మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలని చట్టం చెబుతుందన్నారు.

సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని వడ్లూరు బేగంపేట ఉన్నత పాఠశాలలో మే 1వ తేదీ నుంచి సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి వెగ్గళం సతీశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్ బాల్‌లో నైపుణ్యం పెంపొందించడానికి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించే శిబిరంను ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ కల్యాణ వేడుకలు



కలశాలతో వెళుతున్న మహిళలు

మండలంలోని గురువన్నపేట గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ కల్యాణమ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం డప్పుచప్పుల్లతో శివసత్తుల పూనకాల మధ్య కలశాలు నెత్తినపెట్టుకొని మహిళలు పుట్టకమ్ముడు, గంగతెప్ప కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట)

మోడుబారుతున్న మోచీల జీవితాలు

- బహుళజాతి కంపెనీల ప్రభావం
- అంతరిస్తున్న వృత్తిదారులు
- జిల్లాలో 1000వరకు కుటుంబాలు



రోడ్డుపైనే వృత్తిని నిర్వహిస్తున్న మోచీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇతరుల పాదాలకు హాని కలుగకుండా పాదరక్షలను తయారుచేసే మోచీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పల్లెల్లోను, పట్టణాల్లోను వారికి చేతినిండా పనిఉండేది. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారింది. ఇప్పుడు వారు పొట్టకూటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లాలో దాదాపు 1,000 వరకు మోచీల కుటుంబాలున్నాయి. వారంతా రోడ్లపై కూర్చొని తమవృత్తిని నిర్వహిస్తున్నారు. కాని దినదినం అది దుర్భరంగా మారడంతో వారి బతుకులు అయోమయంలో పడుతున్నాయి. అనేక బహుళజాతి కంపనీలు చెప్పులను ఉత్పత్తి చేయడంతో మోచీలకు అవస్థలు ప్రారంభమయ్యాయి. తక్కువ ధరకే రావడం, మంచిమంచి మోడల్స్‌లో అందుబాటులోకి రావడంతో ప్రజలు వాటివైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో మోచీలు తమ వృత్తిని కోల్పోయారు. మోచీలు తయారుచేసే ఉత్పత్తులను ప్రభుత్వమే ఖరీదు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలలో వారి పాదరక్షలనే వాడేలాచేస్తే ఆదుకున్న వారవుతారని మోచీలు వేడు కుంటున్నారు. తమను ప్రభుత్వం మాత్రమే ఆదుకోవాలని కోరుతున్నారు.

కుటుంబపోషణ భారమైంది..



జిల్లాలో విరివిగా లభిస్తున్న బహుళజాతి కంపనీల ఉత్పత్తుల వల్ల మాకు పని దొరకడం లేదు. గతంలో మా ఉత్పత్తులకు అధిక గిరాకీ ఉండేది. కాని నేడు ఆ పరిస్థితి లేదు. దీంతో మా ఉత్పత్తులకు గిరాకీ తగ్గింది. నేడు మా కుటుంబ పోషణే భారంగా మారింది.

– ఆనందం, సిద్దిపేట

ప్రభుత్వమే ఆదుకోవాలి



మాకు మా వృత్తే ఆధారం. ఇతర దుకాణాల్లో తక్కువ ధరకే చెప్పులు లభించడంతో ప్రజలు వాటి కొనుగోలుకే మొగ్గు చూపుతున్నారు. మేము తయారు చేసిన ఉత్పత్తులకు సరైనధర లభించడంలేదు. ప్రభుత్వం మమల్ని ఆదుకొవాలి.

– బైరి శ్రీనివాస్, సిద్దిపేట

కేసీఆర్ అంటే ప్రజలకు ఒక నమ్మకం

ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్



గజ్వేల్‌రూరల్: ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గజ్వేల్‌రూరల్: కేసీఆర్ అంటే ప్రజలకు ఒక నమ్మకం, భరోసా అని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని దాచారంలో సోమవారం ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్, వైస్ ఎంపీపీ కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరవేరని హామీలతో మోసం

మర్కూక్(గజ్వేల్): నేరవేరని హామీలనిచ్చి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఓడించి గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, ఎంపీపీ పాండుగౌడ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య పేర్కొన్నారు. గంగాపూర్- యూసుఫ్‌ఖాన్‌పల్లి, భవానందాపూర్ గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు ప్రసాద్, నాగరాజు, అశోక్, నరేష్, రాందాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు

మరోమారు మోసపోవద్దు..

కొండపాక(గజ్వేల్): మండలంలోని అంకిరెడ్డిపల్లి, దర్గా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈజీఎస్ పనులు కొనసాగుతున్న చోటకు వెళ్ళి ప్రచారం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్, ర్యాగల్ల దుర్గయ్య, అనంతుల ప్రశాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు వేసి మరోమారు మోసపోవద్దన్నారు. శ్రీనివాస్, రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం

ములుగు(గజ్వేల్): మండలంలోని నర్సాపూర్, శ్రీరాంపూర్ గ్రామాల్లో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పార్టీ మండల అధ్యక్షుడు జహంగీర్, పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. నేతలు జగదీశ్వర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, గణేశ్‌గుప్త, బాల్‌రెడ్డి, లింగారెడ్డి, రాజేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడే కార్మిక ఐక్యతకు సంకేతం

సీఐటీయూ జిల్లా నేత స్వామి

గజ్వేల్‌రూరల్: మేడే కార్మిక వర్గ చైతన్యానికి, ఐక్యతకు సంకేతం అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి అన్నారు. సోమవారం గజ్వేల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా 8గంటల పనిదినాలను సాధించుకునేందుకు లక్షలాది కార్మికులు ఒక్కటైన చరిత్రకు సాక్ష్యం మేడే అన్నారు. గజ్వేల్ పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని పరిశ్రమలు, కార్మికుల అడ్డాల వద్ద మే 1న జెండాలు ఎగురవేయడం ద్వారా కార్మిక ఐక్యతను చాటుతూ మేడేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గుర్తును మరిచి గద్దెకు ముసుగు

హుస్నాబాద్‌రూరల్: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు వివిధ పార్టీల గుర్తులు కనిపించకుండా, గోడపై రాతలను తుడిపేస్తున్నారు. పార్టీ జెండా గద్దెలకు తెల్లటి గుడ్డలను చుట్టి కనిపించకుండా చేస్తున్నారు. అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ జెండా గద్దెకు తెల్లటి ఫ్లెక్సీని చుట్టిన అధికారులు జెండాపై 'కమలం' పువ్వు గుర్తును మాత్రం మరిచారు. దీనిపై ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.



పార్టీ గుర్తును వదిలి గద్దెకు ముసుగు వేసిన దృశ్యం

పోలింగ్‌స్టేషన్ల పరిశీలన

హుస్నాబాద్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని పలు పోలింగ్ స్టేషన్లను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ పరిశీలించారు. సోమవారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన 18 పోలింగ్ కేంద్రాలను సందర్శించి విద్యుత్, తాగు నీటి సౌకర్యం, ఫ్యాన్లు, ర్యాంప్‌పై ఆరా తీశారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మరు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడిమోహన్‌రెడ్డి అన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రఘునందన్ రావుకు మద్దతుగా ఆ పార్టీ శ్రేణులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘునందన్‌రావు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహేశ్, ఉపేందర్‌రావు, జనార్దన్, శంకర్, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ఓడించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): అధికారంలో ఉన్నప్పుడు రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని మోసం చేసిన బీఆర్ఎస్‌ను ఓడించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి భూమేశ్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని రామునిపట్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాజేశ్‌గౌడ్, హరీశ్, శ్రావణ్, ప్రశాంత్, రాజు తదితరులు ఉన్నారు.

భారీ మెజార్టీతో..

సిద్దిపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఉమ్మడి మెదక్ జిల్లా ఎంపీగా భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ అన్నారు. బచ్చాయిపల్లి, చింతమడక, పుల్లూరు, దమ్మచెరువు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సురేశ్‌గౌడ్, యాదగిరి, శ్రీకాంత్, భూపాల్‌రెడ్డి, సురేశ్, కమ్మశ్రీను, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్ముడుపోతే ఆగమవుతాం..

బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు [illegible] తామని, ఆలోచించి అందుబాటులో ఉండే తనను గెలిపించాలని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు కోరారు. సోమవారం దుబ్బాకలో బీజేపీ కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో రైతు సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌గా ఉన్న సమయంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి 'వరివేస్తే రైతులకు ఉరే' అంటూ.. బెదిరించారని మళ్లీ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని వస్తున్నారో ఆలోచించాలన్నారు. రెండుసార్లు ఎంపీగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఏనాడైనా పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై మాట్లాడారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు పొరపాటున ఓట్లువేస్తే ఐదేళ్లు గోస పడతారన్నారు. ఎన్నికల తర్వాత ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం ఖాయమన్నారు. రైతుల అభివృద్ధి కోసం జరుగుతున్న ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు తిరుమల్‌రెడ్డి, సత్యనారాయణ, రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుభాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

బీరప్ప దయతో వానలు సమృద్ధిగా కురవాలి

దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



కల్యాణ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): బీరప్పస్వామి దయతో సమృద్ధిగా వానలు కురిసి పంటలు బాగాపండి రైతు కుటుంబాలు సంతోషం ఉండాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని ఎల్లారెడ్డిపేటలో సోమవారం బీరప్ప కామరతిల కల్యాణోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాసంగిలో కరెంట్ కోతల మూలంగా పంటలు ఎండిపోయి రైతులకు పెట్టుబడి చేతికిరాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వెలుపుల స్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, సీనియర్ నాయకుడు మల్లారెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న బీరప్ప పెద్ద పండుగలో భాగంగా సోమవారం బీరప్ప ఆలయంలో పెద్దపట్నం వేసి కామరతి సహిత బీరప్ప కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు బీర్ల పూజారులు తమ సంప్రదాయ పద్ధతుల్లో కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవానికి వివిధ గ్రామల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ మద్దూరు, దూళ్మిట్ట మండల అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, కురుమ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్పుల రాములు, కురుమ సంఘం దూళ్మిట్ట మండల అధ్యక్షుడు బర్మ రాజమల్లయ్య హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

బడా పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్న బీజేపీ

హమాలీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సుధాకర్



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): బీజేపీ కార్పొరేట్, బడా పెట్టుబడిదారుల కొమ్ముకాస్తోందని, ఆ పార్టీని ఓడించాలని సీఐటీయూ హమాలీ కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి పొలడుగు సుధాకర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని ఆకునూరు, చుంచనకోట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో హమాలీ కార్మికులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీని ఓడించి ప్రజల కోసం పోరాడే సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ని గెలిపించాలని కోరారు. సీపీఎం నాయకులు వెంకట్‌మావో, శ్రీనివాస్, శ్రీకాంత్, యాదగిరి, నర్సిరెడ్డి, సంపత్, మల్లయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీ..

మద్దూరు(హుస్నాబాద్): లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంతో పాటు, సలాఖపూర్, రేబర్తి గ్రామాల్లో ఎండీ జహంగీర్ తరుపున ప్రచారం నిర్వహించారు. మోదీ నియంతృత్వ పాలనలో కార్మికులు, కష్టజీవుల మీద దాడులు జరుగుతున్నాయని వాపోయారు. జిల్లా కమిటీ సభ్యుడు తాటికొండ రవి, గ్రామ కార్యదర్శి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 లోగా రూ.2 లక్షల రుణమాఫీ

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



రోడ్ షోలో అభివాదం చేస్తున్న నీలం మధు

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15లోగా రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి చెప్పారు. సోమవారం జగదేవ్‌పూర్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వమంటే పేద ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు నీలం మధుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బీఆర్ఎస్ అభ్యర్థి ముంపు బాధితులను మోసం చేశారని ఆరోపించారు. దేవుళ్ల పేరుతో బీజేపీ అభ్యర్థి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గొల్లపల్లి చౌరస్తా నుంచి గాంధీ విగ్రహం వరకు రోడ్ షో కొనసాగింది. కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఎంపీపీ బాలేశంగౌడ్, సీనియర్ నాయకులు హన్మంతరెడ్డి, లక్ష్మారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మల్లేశం, చంద్రశేఖర్ రెడ్డి, కరుణాకర్, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆత్మవిశ్వాసం అవసరం

గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు చదువుతోపాటు ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు కృషి చేయాలని ఏఈ మారుతి సూచించారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు వారిలోఉన్న ప్రతిభను ప్రోత్సహించాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు హరిణాపవన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభంద కారిణి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, సభ్యులు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు, నిర్వాహకులు రంగాచారి, శ్రీప్రన్నలక్ష్మి, శిక్షకుడు దొంతి రమేశ్, లక్ష్మీపద్మజ, సాయిబాబు, నరేందర్, నవీన్, అరవింద్, నర్సింహులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రామంచలో వాలీబాల్ శిక్షణ

చిన్నకోడూరు(సిద్దిపేట): రామంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో విద్యార్థులకు ఉచితంగా మే 1 నుంచి 31 వరకు వాలీబాల్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు పీఈటీ ఉప్పలయ్య తెలిపారు. సోమవారం అయన మాట్లాడుతూ 15 ఏళ్ల వయసులోపు విద్యార్థులకు వాలీబాల్ క్రీడపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఈ శిక్షణ ఉంటుందన్నారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

◆ రూ.1.2లక్షలు సీజ్

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని బార్డర్ చెక్ పోస్టు వద్ద భూంపల్లి ఎస్ఐ రవికాంత్‌రావు, స్టాటికల్ సర్వేలెన్స్ టీమ్‌తో కలిసి సోమవారం వాహనాలతోపాటు, ఆర్టీసీ బస్సుల్లో తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీలో బస్సులో ప్రయాణిస్తున్న కామారెడ్డికి చెందిన మాధవరెడ్డి ఎలాంటి పత్రాలు లేకుండా రూ.1.2 లక్షల నగదును తీసుకెళ్తుండగా సీజ్ చేశారు.

◆ అధ్యాపకురాలికి డాక్టరేట్

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బాటనీ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న సిరినేని స్వప్నకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అందించింది. ఈ సందర్భంగా సోమవారం స్వప్న మాట్లాడుతూ పోయేసియా 'గడ్డిజాతి కుటుంబం పుప్పొడి విశ్లేషణ, వర్గీకరణ' అనే అంశంపై అధ్యయనం చేసినందుకు గాను తనకు డాక్టరేట్ అందించడం సంతోషంగా ఉందన్నారు. పర్యవేక్షకుడు విజయభాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ తదితరులు స్వప్నను అభినందించారు.

◆ దుకాణాలకు బహిరంగ వేలం

హుస్నాబాద్: దేవాదాయ ధర్మాదాయశాఖ రేణుకా ఎల్లమ్మ జాతర పురస్కరించుకొని సోమవారం పలు దుకాణాల ఏర్పాటుకు బహిరంగవేలం నిర్వహించారు. రెండు మాసాలకు గాను టెంకాయలు, పూజాద్రవ్యాలు అమ్ముకునే హక్కు రూ.2.32లక్షలు, చీరలు సేకరించి అమ్ముకునే హక్కు రూ.3.01లక్షలు. కొబ్బరి ముక్కలు సేకరించడానికి రూ.90 వేలు, జాతర అనంతరం పది మాసాలు టెంకాయలు, పూజా ద్రవ్యాలు అమ్ముకునే హక్కు రూ.2.22లక్షలు ఆదాయం సమకూరింది. అలాగే వ్యయం టెండర్లు తడకలు, పందిర్లు వేయడం రూ.39 వేలు, ఎలక్ట్రీషియన్, డెకరేషన్ రూ.59516, శుభ్రం చేయడం రూ.33వేలు, క్యాటరింగ్ ఒక్కింటికి రూ.77 చెల్లించడం, గత ఏడాది కంటే అదనంగా రూ.1.95లక్షలు ఆలయానికి ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

◆ నూతన భవనం, వాహనం కోసం వినతి

దుబ్బాక: స్థానిక ఫైర్ స్టేషన్‌కు భవన నిర్మాణంతో పాటు కొత్త ఫైర్‌ఇంజన్‌ను మంజూరు చేయాలని దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు మాడవైన శ్రీకాంత్ కోరారు. సోమవారం ఫైర్‌సర్వీస్ కరీంనగర్ డీఎఫ్ఓను కలిసి వినతి పత్రం అందించారు. త్వవసర సేవలు అందించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఫైర్ ఇంజన్, వాహనాలు మంజూరు చేయాలని కోరారు.

◆ అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

చేర్యాల(సిద్దిపేట): అదనపు కట్నం తేవాలంటూ భర్త, అత్త, మామ వేధిస్తున్నారని గుర్జకుంట గ్రామానికి చెందిన కాశెట్టి భవాని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీకి గుర్జకుంట గ్రామానికి చెందిన పాండుతో 2020లో వివాహం జరిగింది. వారికి పాప పుట్టిన నాటి నుంచి అదనపు కట్నం తేవాలని వేధింపులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం పాండు చేయిచేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

◆ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దళిత ద్రోహి

దుబ్బాకటౌన్: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఎస్పీ పార్టీని వీడి దళితుల ఆత్మగౌరవాన్ని బీఆర్ఎస్ పార్టీ వద్ద తాకట్టు పెట్టి దళిత ద్రోహిలా వ్యవహరించాడని మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ మండిపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దళితులను మోసం చేసిన ప్రవీణ్ కుమార్‌కు డిపాజిట్ కూడా దక్కదన్నారు.

◆ సెల్‌ఫోన్ అప్పగింత

గజ్వేల్‌రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో స్వాధీనం చేసుకుని తిరిగి బాధితుడికి అప్పగించినట్లు అదనపు సీఐ ముత్యంరాజు తెలిపారు. ప్రజ్ఞాపూర్‌కు చెందిన కిషన్‌రావు నెల రోజుల క్రితం సెల్‌ఫోన్‌ను పోయిందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నూతన టెక్నాలజీ సాయంతో ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు.

◆ మద్యం పట్టివేత

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని బందారం, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లోని ఇద్దరు అక్రమ మద్య విక్రయదారులను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.